క్లుప్తంగా

జ్యోతిబాపూలే విగ్రహం ఏర్పాటు చేయాలని నిరసన


నిరసన తెలుపుతున్న నాయకులు

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని బెల్లంపల్లి చౌరస్తాలో మహాత్మా జ్యోతిబాపూలే విగ్రహం ఏర్పాటు చేయాలని తెలంగాణ బీసీ జాగృతి నాయకులు డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ సమావేశ మందిరం వద్ద శుక్రవారం నిరసన తెలిపారు. మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య, వైస్ చైర్మన్ ముఖేశ్‌గౌడ్ మాట్లాడుతూ స్థలం కేటాయించే విషయంపై కలెక్టర్ ఎమ్మెల్యే, మున్సిపల్, పోలీస్, అగ్నిమాపక శాఖకు చెందిన ఫైవ్‌మెన్(ఐదుగురు సభ్యుల) కమిటీకి సిఫారసు చేస్తున్నట్లు తెలిపారు. బీసీ జాగృతి జిల్లా అధ్యక్షుడు నరెడ్ల శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు భాస్కర్, వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లేశ్, ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, నాయకులు పాల్గొన్నారు.

గడపగడపకూ కాంగ్రెస్ పాదయాత్ర


బాపురావుపేటలో ప్రజలతో మాట్లాడుతున్న పీసీసీ సభ్యుడు రమేశ్

చెన్నూర్‌రూరల్: మండలంలోని బావురావుపేట, గుండాయిపల్లె, సాయినగర్ గ్రామాల్లో శుక్రవారం గడప గడపకూ పాదయాత్రను నియోజకవర్గ పీసీసీ సభ్యుడు నూకల రమేశ్ ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ హయాంలో అభివృద్ధి జరిగిందన్నారు. పార్టీని అధికారంలోకి వస్తే రైతులకు రూ.2లక్షల రుణమాఫీ, పేదలకు ఇందిరమ్మ ఇళ్లు, నిరుద్యోగులకు రూ.4వేల నిరుద్యోగ భృతి ఇస్తామన్నారు. పార్టీ నాయకులు గజ్జెల అంకాగౌడ్, ముత్యాల బాపాగౌడ్, చెన్న సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సాయిచంద్ మృతి తీరనిలోటు


కాజిపల్లిలో నివాళులు అర్పిస్తున్న నాయకులు

భీమారం: తెలంగాణ ఉద్యమ కారుడు, గాయకుడు సాయిచంద్ మృతి తీరనిలోటని గొర్రెలు, మేకలు పెంపకందారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము అశోక్‌యాదవ్ పేర్కొన్నారు. మండలంలోని కాజిపల్లి గ్రామంలో సాయిచంద్ సంతాపసభ ఏర్పాటు చేసి ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఎంపీటీసీ పెద్దల రూప,సర్పంచ్ దాడి తిరుపతి, నాయకులు బాపు రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్, రాజన్న పాల్గొన్నారు.

జన్నారం: మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట సాయిచంద్ చిత్రపటానికి అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు సిటుమల్ల భరత్‌కుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా ఉపాధ్యక్షులు ప్రభుదాస్, ఇందయ్య, నాయకులు రమేశ్, దేవ, రవి, సృజన్, వెంకటేశ్, బీఆర్ఎస్ నాయకులు సతీశ్ కుమార్, నర్సగౌడ్, జనార్దన్, కరుణాకర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ మైనార్టీ విభాగం పట్టణ అధ్యక్షుడిగా అఫ్జల్



రామకృష్ణాపూర్: కాంగ్రెస్ మైనార్టీ విభాగం క్యాతనపల్లి మున్సిపాలిటీ పట్టణ అధ్యక్షుడిగా సయ్యద్ అఫ్జల్‌ను నియమించారు. ఈ మేరకు ఏఐసీసీ సభ్యుడు కొక్కిరాల ప్రేంసాగర్‌రావు శుక్రవారం నియామకపు ఉత్తర్వులు అందించారు. పార్టీ బలోపేతం కోసం తనవంతు కృషి చేస్తానని అఫ్జల్ అన్నారు.

గ్రామాల్లో సివిల్ రైట్స్ డే

దండేపల్లి: మండలంలోని రెబ్బనపల్లిలో శుక్రవారం సివిల్ రైట్స్‌డే కార్యక్రమాన్ని నిర్వహించారు. తహసీల్దార్ హన్మంతరావు, ఎస్సై ప్రసాద్‌లు పౌర హక్కుల గురించి వివరించారు. పౌర హక్కులపై ప్రజలు అవగాహన ఉండాలన్నారు. అంటరానితనాన్ని నిర్మూలించాలన్నారు. ఎంపీడీవో మల్లేశం, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, విజిలెన్స్ అండ్ మానిటరింగ్ సభ్యులు వెంకటేశ్, అంజన్న తదితరులు పాల్గొన్నారు.

వేమనపల్లి: సుంపుటం పంచాయతీ కేంద్రంలో సివిల్ రైట్స్ డే నిర్వహించారు. ఎంపీవో బాపురావు, సర్పంచ్ బాపు, జూనియర్ అసిస్టెంట్ దేవేందర్ పాల్గొన్నారు.

పట్టణ సమస్యలపై ఆగ్రహం

- అధికారులను నిలదీసిన అధికార, ప్రతిపక్ష కౌన్సిలర్లు
- ప్రజలకు మూడురోజులకు తాగునీరు ఇవ్వడం ఏంటని ప్రశ్న
- మున్సిపల్ సమావేశంలో సమస్యలపై ఏకరువు


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య

మంచిర్యాలటౌన్: మున్సిపాలిటీ సాధారణ సమావేశాన్ని మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ పెంట రాజయ్య, వైస్ చైర్మన్ ముఖేశ్‌గౌడ్, కమిషనర్ మారుతి ప్రసాద్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. 9 అంశాలతో కూడిన ఎజెండాను చదువుతుండగా అధికార, ప్రతిపక్ష పార్టీల కౌన్సిలర్లు వార్డుల్లోని వివిధ సమస్యలపై అధికారులను నిలదీశారు. రోడ్లు, డ్రెయినేజీలు, తాగునీటికి ప్రజలు ఇబ్బంది పడుతున్నా స్పందించకపోవడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణప్రజలకు మూడు రోజుల తర్వాతనే తాగునీరందించడం ఏంటని ప్రశ్నించారు. ఇందుకు అధికారులు సమాధానం చెప్పడం లేదని, ప్రజలకు తామేం చెప్పాలని నిలదీశారు. కొత్తగా వేస్తున్న బైపాస్ రోడ్డు మధ్యలో డివైడర్‌కు రిజిస్ట్రేషన్ కార్యాలయం వద్ద గ్యాప్ వదలాలన్న తన మాట వినడం లేదని కౌన్సిలర్ వేములపల్లి సంజీవ్ అన్నారు.

- మున్సిపల్ ఇంజినీర్లు ట్రాఫిక్ పోలీసులను సంప్రదించకుండానే ఇష్టారీతిన రోడ్ల నిర్మాణం చేపట్టడం, నాలుగు జంక్షన్ల ఏర్పాటులో అధికారుల నిర్లక్ష్యంతో ఇటీవల ఒకరు జంక్షన్ వద్ద సర్కిల్‌ను బైక్‌తో ఢీకొన్ని మృతి చెందారని సభ్యులు పేర్కొన్నారు.
- వార్డుల్లో పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా ఉందని, కార్మికులతో పని చేపట్టాలని కోరారు.
- హమాలివాడకు వెళ్లే దారి 60 ఫీట్ల కోసం అడ్డుగా ఉన్న ఇళ్లను కూలగొట్టినా, ఇప్పటికి ఎందుకు పనులు ప్రారంభించడం లేదని కౌన్సిలర్ పోరెడ్డి రాజు ప్రశ్నించారు.
- వార్డులో డ్రెయినేజీ సమస్య ఉందని, ఎన్నిసార్లు చెప్పినా నిర్మాణం చేపట్టడం లేదని 2వ వార్డు కౌన్సిలర్ సల్ల మహేశ్ పేర్కొన్నారు.
- 9 అంశాల ఎజెండాతో సమావేశం ప్రారంభించినా, రెండు అంశాలైన రూ.39 లక్షల సాధారణ నిధుల అభివృద్ధి పనులు, పట్టణంలోని 255 సీసీ కెమెరాలు, వాటి మెయింటనెన్స్‌కు రూ. 5.78,200లను సాధారణ నిధుల నుంచి చెల్లించేందుకు కౌన్సిల్ ఆమోదం తెలిపారు. మిగతా అంశాలను చదవకుండానే సమావేశం ముగించారు.

దశాబ్ది ఉత్సవాల్లో అడ్డగోలు ఖర్చు

తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా అడ్డగోలు ఖర్చుపై కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. తూతూమంత్రంగా జరిపించిన పలు కార్యక్రమాలకు లక్షల రూపాయల బిల్లులు వేయడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. పట్టణ ప్రగతి దినోత్సవం రోజు 62 వాహనాలను పూలతో అలంకరించేందుకు రూ.35 వేలు, 400ల మంది పాల్గొన్న పట్టణ ప్రగతికి 800ల మందికి భోజనాలకు గాను రూ.1.20 లక్షలు, అమరవీరుల స్తూపం వద్ద పూలతో అలంకరణ, స్వీట్ల పంపిణీ పేరిట రూ. 68 వేలు, మంచినీటి దినోత్సవాన్ని ముల్కల్ల పంప్‌హౌజ్ వద్ద సాదాసీదాగా సమావేశం ఏర్పాటు చేసి, 25 మంది పాల్గొనలేదని కాని టిఫిన్ల పేరిట రూ.11,500 బిల్లులు వేశారన్నారు. ఫ్లెక్సీల పేరిట రూ. 83,500లు ఎక్కడ, ఎందుకు ఖర్చు చేశారనే దానిపై కౌన్సిలర్లు నిలదీశారు. వార్డుల్లో అభివృద్ధి పనులు చేపట్టకుండానే దశాబ్ది ఉత్సవాల పేరిట మున్సిపల్ నిధులు రూ. 4.42 లక్షలను ఖర్చు చేయడం సరికాదనే అభిప్రాయాన్ని పలువురు కౌన్సిలర్లు వ్యక్తం చేయడం గమనార్హం.

వరదలకు శాశ్వత పరిష్కారం చూపాలి


ఇంటింటికీ ప్రచారం చేస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్

మంచిర్యాలటౌన్: పట్టణానికి వరదలు రాకుండా శాశ్వత పరిష్కారం చూపించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి డిమాండ్ చేశారు. ప్రధాని మోదీ 9 ఏళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా జిల్లా కేంద్రంలోని 21వ వార్డు బాలాజీనగర్, పెద్దమ్మ గుడి ఏరియాలోని ఇంటింటికీ వెళ్లి, ప్రధాని చేపట్టిన అభివృద్ధిని, సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా రఘునాథ్ మాట్లాడుతూ గత రెండేళ్లుగా వరదలు వచ్చి పట్టణ ప్రజలు తీవ్రంగా నష్టపోయారని, బాధితులకు శాశ్వత పరిష్కారం చూపించడంలో స్థానిక ఎమ్మెల్యే విఫలమయ్యారన్నారు. నాయకులు పెద్దపల్లి పురుషోత్తం, రజనీశ్ జైన్, కిశోర్, లక్ష్మణ్, సత్యం, కుచాడి సతీశ్, అమిరిశెట్టి రాజు, రాకేశ్ రెన్వా పాల్గొన్నారు.

జైపూర్: వేలాల గ్రామంలో శుక్రవారం మేరా బూత్ సబ్‌సే మజ్బూద్ కార్యక్రమంలో భాగంగా బీజేపీ నేతలు ఇంటింటి ప్రచారం చేపట్టారు. 9 ఏళ్లల్లో కేంద్రం అమలు చేస్తున్న పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై నాయకులు విస్తృత ప్రచారం నిర్వహించారు. ఓబీసీ జిల్లా ప్రదానకార్యదర్శి డేగ నగేశ్, పార్టీనాయకులు గంగారాం, జాడి ఏసయ్య, మండల ఉపాధ్యక్షులు పోచన్న పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి


మొక్కకు నీళ్లుపోస్తున్న జీఎం మోహన్‌రెడ్డి

మందమర్రిరూరల్: ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని మందమర్రి ఏరియా జీఎం మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మందమర్రి ఏరియాలోని జీఎం ఆఫీస్ ఆవరణలో శుక్రవారం స్వచ్ఛతా పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం ఆఫీస్ ఆవరణలో మొక్కలకు నీళ్లు పోశారు. అనంతరం పారిశుధ్య కార్మికులను సన్మానించారు. కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన పలు పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఎస్వోటూ జీఎం రాజేశ్వర్‌రెడ్డి, పర్సనల్ మేనేజర్ సట్ల శ్యాంసుందర్ ఉన్నారు.

తాండూర్: నర్సాపూర్ గిరిజన పునరావాస గ్రామంలో బెల్లంపల్లి ఏరియా జీఎం జీ.దేవేందర్ గ్రామస్తులు, విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. సర్పంచ్ జంగుబాయి, ఇన్‌చార్జి ఎస్ఓటూ జీఎం ఉమాకాంత్, ఏజీఎం తిరుమల్‌రావు, డీజీఎంలు (సివిల్) సతీశ్‌బాబు, (ఎఫ్ఏ) రామారావు, ఐఈడీ ఉజ్వల్ కుమార్ బెహారా, పర్సనల్ మేనేజర్ లక్ష్మణ్‌రావు, జూనియర్ ఫారెస్టు అధికారి నవీన్, పర్యావరణ అధికారి హరీశ్, బీపీఏ ఓసీ–2 మేనేజర్ మహేశ్ పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగులకు సన్మానం


సన్మానిస్తున్న ఏజెంట్ రాముడు, తదితరులు

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్‌లోని పలు గనులపై రిటైర్డ్ ఉద్యోగులను సన్మానించి వీడుకోలు పలికారు. శుక్రవారం ఆర్కే న్యూటెక్ గనిపై జరిగిన కార్యక్రమంలో గ్రూప్ ఏజెంట్ రాముడు, గని మేనేజర్ స్వామి రాజు, రిటైర్డ్ అయిన కుమారస్వామిని(ఫిట్టర్), శంకరయ్య(జనరల్ మజ్దూర్)ను సన్మానించారు. అనంతరం గనిపై హరితహారం నిర్వహించి మొక్కలు నాటారు. గని రక్షణాధికారి కొట్టే రమేశ్, సంక్షేమ అధికారి పాల్ సృజన్, టీబీజీకేఎస్ ఫిట్ సెక్రెటరీ జంపయ్య పాల్గొన్నారు.

ఆర్కే 7 గనిలో..

ఆర్కే 7 గనిలో రిటైర్డ్ అయిన ఉద్యోగులు దాసరి రామచంద్ర, పెద్దపల్లి బాపు, ఎం.రాములు, సిరిశెట్టి రాజయ్యను ఏజెంట్ రాముడు, గని మేనేజర్ సాయిప్రసాద్‌లు సన్మానించారు. రక్షణాధికారి రవిశంకర్, ఇంజినీర్ రమేశ్, వెంటిలేషన్ అధికారి జగదీశ్వర్ రావు, సంక్షేమాధికారి శాంతన్, టీబీజీకేఎస్ ఫిట్ సెక్రెటరీ వెంకటి, ఏఐటీయూసీ నాయకులు వీరభద్రయ్య, కిషన్‌రావు, సీఐటీయూ నాయకుడు భాగ్యరాజు పాల్గొన్నారు.

ఏరియా ఇంజినీర్‌కు సన్మానం

శ్రీరాంపూర్: ఏరియా ఇంజినీర్‌గా పనిచేసి రిటైర్డ్ అయిన జి.రమేశ్‌బాబును అధికారులు సన్మానించారు. శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్లో జీఎం సంజీవరెడ్డి.. రమేశ్‌బాబు దంపతులను శాలువాతో సత్కరించారు. ఏజీఎం ఫైనాన్స్ మురళీధర్, డీజీఎంలు అరవింద్‌రావు చిరంజీవి, శివరావు, ఏరియా రక్షణాధికారి శ్రీధర్‌రావు, క్వాలిటీ మేనేజర్ కె.వెంకటేశ్వర్‌రెడ్డి, ఏరియా సర్వే అధికారి వెంకటేశం, పర్చేస్ చంద్రశేఖర్, పర్సనల్ మేనేజర్ రాజేశ్వర్, సీనియర్ పీవో కాంతారావు పాల్గొన్నారు.

మంచిర్యాలటౌన్: మున్సిపాలిటీలో శుక్రవారం రిటైర్ అయిన ముగ్గురు కార్మికులను చైర్మన్ పెంట రాజయ్య సన్మానించారు. పబ్లిక్ హెల్త్ వర్కర్లుగా పనిచేస్తున్న జిలకర చిన్నయ్య, బూడిద శంకర్, గొట్టె భామ ఇన్నాళ్లు మున్సిపాలిటీకి చేసిన సేవలను అభినందించారు. వైస్ చైర్మన్ ముఖేశ్‌గౌడ్, కమిషనర్ మారుతి ప్రసాద్, ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ సునీల్, కౌన్సిలర్లు సునీత, మహేశ్వరి, చైతన్యరెడ్డి, సంజీవ్, మాజిద్, హరికృష్ణ, మహేశ్ ఉన్నారు.

కాసిపేట: మందమర్రి ఏరియా కాసిపేటగనిపై శుక్రవారం ఉద్యోగ విరమణ పొందిన సాండ్ మిక్సింగ్ కోన్ ఆపరేటర్ బోంతు సత్యానందంను అధికారులు, కార్మిక సంఘాల నాయకులు సన్మానించారు. గ్రూఫ్ ఏజెంటు రాజేందర్, గని మేనేజర్ అల్లావుద్దీన్, గుర్తింపు ప్రాతినిధ్య సంఘాల నాయకులు చిప్ప నర్సయ్య, మల్లేశ్, లక్ష్మీనారాయణ, రాజన్న, లక్ష్మణ్‌దాస్, సమ్మయ్య, అబ్దుల్, శ్రీనివాస్, అశోక్, రక్షణాధికారి సునీల్, సంక్షేమాధికారి మీర్జా గౌస్ జీశాన్, ఇంజినీర్లు బాబు, మధుకర్, అండర్ మేనేజర్ నిఖిల్ ఉన్నారు.

కాసిపేట: కాసిపేట గ్రూప్ ఏజెంటు పనిచేసి ఆర్జీ3 ఏరియా ఓసీ–2కు ప్రాజెక్టు ఆఫీసర్‌గా బదిలీపై వెళ్తున్న కుర్మ రాజేందర్‌ను అధికారులు, కార్మిక సంఘాల నాయకులు, ఉద్యోగులు శుక్రవారం సన్మానించారు. జూనియర్ అసిస్టెంట్ బన్న లక్ష్మణ్‌దాస్, అటెండర్ వెంకటరమణలు గజామాలతో సత్కరించారు. గని మేనేజర్ అల్లావుద్దీన్, టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు సంపత్, కేంద్ర కమిటీ వైస్ ప్రెసిడెంట్ సంపత్, ఏఐటీయూసీ సీనియర్ నాయకుడు చిప్ప నర్సయ్య, బ్రాంచి కార్యదర్శి మల్లేశ్, ఫిట్ కార్యదర్శి లక్ష్మీనారాయణ, టీబీజీకేఎస్ నాయకులు రాజన్న, రాజశేఖర్, సమ్మయ్య, రక్షణాధికారి సునీల్, సంక్షేమాధికారి జీశాన్ పాల్గొన్నారు.

మందమర్రిరూరల్: కేకే–1 డిస్పెన్సరీలో పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన జనార్దన్–పీఎస్ కుమారి దంపతులను టీబీజీకేఎస్ నాయకులు, సిబ్బంది సన్మానించారు.

బీజేపీ, కాంగ్రెస్, సీపీఐ నాయకుల అరెస్ట్


దేవాపూర్ పోలీస్‌స్టేషన్‌లో నాయకులు


తాండూర్: అరెస్టయిన నాయకులు

తాండూర్/నెన్నెల/బెల్లంపల్లి/భీమారం/లక్సెట్టిపేట/కాసిపేట/జన్నారం/మంచిర్యాలఅర్బన్: కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో సీఎం కేసీఆర్ శుక్రవారం పర్యటన సందర్భంగా బీజేపీ, కాంగ్రెస్ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. తాండూర్ నుంచి బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి చిలుముల కృష్ణ దేవరాయలు, మండల అధ్యక్షుడు ఆర్.మహీధర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి విష్ణు కళ్యాణ్, నాయకులు పోలీసు స్టేషన్‌లో ఉంచారు. నెన్నెల నుంచి బీజేపీ మండల అధ్యక్షుడు ఠాకూర్ శైలేందర్ సింగ్, ప్రధాన కార్యదర్శి గోగు సురేందర్, కోట రాజలింగు అరెస్టుచేశారు. బెల్లంపల్లిలో కాంగ్రెస్ అసెంబ్లీ నియోజకవర్గ నాయకుడు నాతరి స్వామిని హౌజ్ అరెస్టు చేశారు. తాళ్లగురిజాల పోలీసులు ఇంటి వద్ద బందోబస్తు చర్యలు తీసుకున్నారు. భీమారంలో బీజేపీ మండల అధ్యక్షుడు వేల్పుల శ్రీనివాస్, మండల గిరిజన మోర్చానాయకులు ఆజ్మీరా సురేశ్, బుక్యా వినోద్, లక్సెట్టిపేటలో కాంగ్రెస్, సీపీఐ, బీజేపీ నాయకులను అదుపులో తీసుకున్నారు. వీరిలో ఎండీ ఆరీఫ్, రాజు, హైమద్, దొండ ప్రభాకర్, రాజేశ్, మధుకర్ ఉన్నారు. కాసిపేట మండలం దేవాపూర్‌లో కాంగ్రెస్, బీజేపీ నాయకులను అరెస్టు చేశారు. జన్నారంలో సీపీఎం, బీజేపీ, కాంగ్రెస్ నాయకులను అరెస్ట్ చేసి సాయంత్రం సొంత పూచీకత్తుపై వదిలేశారు. విద్యార్థి సంఘాల నాయకులను అరెస్ట్ చేయడం సరికాదని మంచిర్యాలలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తిరుపతి పేర్కొన్నారు.

మోడ్రన్ ధోబీఘాట్ ఏర్పాటు చేయాలి


మున్సిపల్ కమిషనర్ రమేశ్‌కు వినతిపత్రం అందజేస్తున్న రజక సంఘం నాయకులు

నస్పూర్: పట్టణంలో మోడ్రన్ ధోబీఘాట్ ఏర్పాటు చేయాలని రజక వృత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు తంగళ్లపల్లి వెంకటేశ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సంఘం నాయకులు మున్సిపల్ కమిషనర్ రమేశ్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్ మాట్లాడుతూ మునుగోడు ఉప ఎన్నిక సందర్భంగా అన్ని మున్సిపాలిటీల పరిధిలో మోడ్రన్ ధోబీఘాట్లు ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చాలన్నారు. ప్రధాన కార్యదర్శి పాయిరాల రాములు, నాయకులు చందర్, రవి, మహేశ్, రామస్వామి పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం

- ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య


ఈసీజీ యంత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే

బెల్లంపల్లిరూరల్: ప్రజల మేలు కోసం నిత్యం అనేక విధాలుగా సహాయ సహకారాలు అందిస్తున్న లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. మండలంలోని తాళ్లగురిజాల పీహెచ్‌సీలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈసీజీ యంత్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పీహెచ్‌సీకి వచ్చే రోగులకు ఇబ్బందులు కలుగకుండా ఈసీజీ యంత్రాన్ని అందజేయడం హర్షణీయమన్నారు. లయన్స్‌క్లబ్ డిస్ట్రిక్ గవర్నర్ రిక్కల నారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రతీ గ్రామానికి లయన్స్ క్లబ్ సేవలను విస్తృతం చేస్తామన్నారు. ఎంపీపీ శ్రీనివాస్, బెల్లంపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ శ్వేత, వైస్ చైర్మన్ సుదర్శన్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, కార్యదర్శి ప్రభాకర్, క్లబ్ ప్రతినిధులు నర్సింగం, రాజారావు, పీహెచ్‌సీ వైద్యులు అనీష్, శివపత్రాప్ పాల్గొన్నారు.

పోడుభూములకు పట్టాలివ్వాలని ధర్నా


తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

జన్నారం: సీఎం కేసీఆర్ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం పోడుభూములు సాగు చేసుకుంటున్న గిరిజనులు, గిరిజనేతరులకు పట్టాలివ్వాలని గ్రామీణ పేదల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నేతావత్ రాందాస్ డిమాండ్ చేశారు. గ్రామీణ పేదల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అనంతరం తహసీల్దార్ కిషన్‌కు వినతిపత్రం అందజేశారు. మండల అధ్యక్షుడు దారంగుల ఎల్లయ్య, నాయకులు నర్సయ్య, రాజమౌళి, కిషన్, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

'ధర్మరాజు'లో ఏఆర్టీ వైద్యసేవలు


డాక్టర్ అగుమంచి రాణి

మంచిర్యాలటౌన్: జిల్లాకేంద్రంలోని 'ధర్మరాజు' మెటర్నిటీ నర్సింగ్ హోంలో అసిస్టెడ్ రీ ప్రొడెక్టివ్ టెక్నాలజీ (ఏఆర్టీ) వైద్య సేవలందిస్తున్నట్లు డాక్టర్ అగుమంచి రాణి తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ జిల్లాలో ఇది మొదటిదని పేర్కొన్నారు. ఆసుపత్రిలో నిర్వహించే టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్‌కు ఇటీవల కేంద్ర ప్రభుత్వం ఏఆర్టీ బృందం ద్వారా ఏఆర్టీ లెవల్–2 గుర్తింపు లభించిందని తెలిపారు. జిల్లాలో ఈ సర్టిఫికెట్ ఉన్న ఏకైక సంతాన సాఫల్య కేంద్రంగా ధర్మరాజు టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్‌గా నిలిచిందని అన్నారు. పిల్లలు లేని వారికి నీటి బుడగలు(పీసీఓడీ), గడ్డలు, కంతులు, పొరలతో బాధపడుతున్న వారికి అత్యాధునిక టెక్నాలజీతో వైద్య సేవలందిస్తున్నట్లు తెలిపారు.

సంక్షిప్త వార్తలు

సాదాసీదాగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

నస్పూర్: మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం సాదాసీదాగా ముగిసింది. మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన సమావేశంలో పలు ఎజెండాలో పొందుపర్చిన 33 అంశాలపై సభ్యులు చర్చించి ఏకగ్రీవంగా ఆమోదించారు. సమావేశంలో వైస్ చైర్మన్ తోట శ్రీనివాస్, కమిషనర్ టి.రమేశ్, అధికారులు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

బిజిగిరిషరీఫ్‌లో సందల్

శ్రీరాంపూర్: సీఎం కేసీఆర్, టీబీజీకేఎస్ గౌరవ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత నిండునూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుతూ శుక్రవారం బిజిగిరి షరీఫ్‌లో సందల్ నిర్వహించామని సింగరేణి యువజన విభాగం అధ్యక్షుడు సిద్దిక్ తెలిపారు. ఈ సందర్భంగా చాదర్‌ను సమర్పించామన్నారు.

కోరం లేక సమావేశం వాయిదా

తాండూర్: మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం వాయిదాపడింది. ఉదయం 11 గంటలకు సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేయగా కొత్తపల్లి ఎంపీటీసీ సభ్యురాలు రెబ్బెన యశోద, అచ్చులాపూర్ సర్పంచ్ దాగం శంకరమ్మ మాత్రమే హాజరయ్యారు. మిగతా సభ్యుల గైర్హాజరుతో కోరం లేక సమావేశం వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ ప్రకటించారు. ఎంఈవో ప్రభాకర్, ట్రాన్స్‌కో ఏఈ ప్రభాకర్, అధికారులు పాల్గొన్నారు.

సత్యదేవున్ని దర్శించుకున్న డీఆర్‌డీవో

దండేపల్లి: గూడెం శ్రీసత్యనారాయణస్వామిని డీఆర్‌డీవో శేషాద్రి శుక్రవారం దర్శించుకున్నారు. అధికారులు స్వామివారి శేషవస్త్రంతో సత్కరించారు.

కేసీఆర్ సభకు తరలిన బీఆర్ఎస్ నేతలు

మందమర్రిరూరల్/భీమిని: కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో శుక్రవారం జరిగే సీఎం కేసీఆర్ బహిరంగ సభకు బీఆర్ఎస్ నాయకులు తరలివెళ్లారు. ఆర్టీసీ బస్సులు, వాహనాల్లో వెళ్లారు. బీఆర్ఎస్ మందమర్రి పట్టణ అధ్యక్షుడు రవీందర్, ఇన్‌చార్జి బత్తుల శ్రీనివాస్, టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు సంపత్, బెల్లంపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ నిరంజన్‌గుప్తా, కన్నెపల్లి జెడ్పీటీసీ సత్యనారాయణ ఆధ్వర్యంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు వెళ్లారు.

క్విజ్ పోటీల పోస్టర్ ఆవిష్కరణ

చెన్నూర్: ఈనెల 2, 3, 4 తేదీల్లో కాంగ్రెస్ యూత్ ఆధ్వర్యంలో ఆన్‌లైన్ క్విజ్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలంగాణ రాష్ట్ర డాక్టర్స్ సెల్ వైస్ చైర్మన్ డాక్టర్ దాసారపు శ్రీనివాస్ తెలిపారు. పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో క్విజ్ పోటీల పోస్టర్‌ను ఆవిష్కరించారు.

డిగ్రీ అడ్మిషన్లు ప్రారంభం

మంచిర్యాలఅర్బన్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డా.బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం డిగ్రీలో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని ప్రిన్సిపాల్ చక్రపాణి తెలిపారు. బీఏ, బీకాం, బీఎస్సీ, గ్రూపుల్లో ప్రవేశాలు పొందవచ్చునని పేర్కొన్నారు.

గోరింటాకు సంబరాలు

మంచిర్యాలటౌన్: ఆషాడమాసం పురస్కరించుకుని శుక్రవారం జిల్లా కేంద్రంలోని అంగన్‌వాడీ టీచర్లు మేదరవాడ అంగన్‌వాడీ కేంద్రంలో గోరింటాకు సంబరాలను జరుపుకున్నారు. టీచర్లు ఒకరికొకరు గోరింటాకును పెట్టుకున్నారు.

పకడ్బందీ ప్రణాళికతో బోధకాల నిర్మూలన

మందమర్రిరూరల్: పకడ్బందీ ప్రణాళికతో బోధకాల వ్యాధి నిర్మూలన సాధ్యమని హెల్త్ ఎడ్యూకేటర్ శ్రీనివాస్ తెలిపారు. పట్టణంలోని దీపక్‌నగర్‌లో గల అర్బన్ హెల్త్ సెంటర్లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆగస్టు 10,11,12 తేదీల్లో ఇంటింటికి సర్వే చేస్తామని లక్షణాలున్న వారికి మాత్రలు అందిస్తారని అన్నారు.

జీపీ భవన నిర్మాణాలకు భూమిపూజ

వేమనపల్లి: సుంపుటం, కళ్లంపల్లి పంచాయతీల మంజూరైన భవన నిర్మాణాలకు సర్పంచ్ బాపు, ఎంపీఓ బాపురావులు భూమి పూజ చేశారు. మండల సర్వేయర్, కార్యదర్శులు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

వీధి దీపాలు ఏర్పాటు చేయండి

వేమనపల్లి: మండల కేంద్రంలో అన్ని వీధుల్లో వీధి దీపాలు ఏర్పాటు చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు మల్లేశ్, ప్రధాన కార్యదర్శి సంతోష్ కోరారు. ఈ మేరకు ఎంపీవో బాపురావుకు వినతిపత్రం అందజేశారు.

లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం

బెల్లంపల్లి: బెల్లంపల్లి లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రత్నం తిరుపతిరెడ్డి, సెక్రెటరీగా దాసరి అరుణ సుందరి, కోశాధికారిగా ఇందారపు రాజన్నను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఘనంగా గీతా హవన యజ్ఞం

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఆర్కే 6 కాలనీలోని గీతా ప్రశాంతి నిలయంలో గీతా హవన యజ్ఞం ఘనంగా జరిగింది. సత్సంగం గురూజీ దాసరి రాజేశం దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించారు.

ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

నస్పూర్: పట్టణంలోని పలు ప్రైవేటు పాఠశాలలో ఎలాంటి అనుమతులు లేకుండా పాఠ్య పుస్తకాలు స్టేషనరీ వస్తువులు విక్రయిస్తున్న పాఠశాలలపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్ష కార్యదర్శులు బండి సత్యనారాయణ, ఈదునూరి అభినవ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయా పాఠశాలల ఎదుట ఆందోళన చేపట్టారు. గజర్ల విష్ణు, శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

సర్దుబాటు ప్రక్రియ నిష్పక్షపాతంగా చేయాలి

దండేపల్లి: ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియను నిష్పక్షపాతంగా, నిబంధనల ప్రకారం చేపట్టాలని యూటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు ఎంఈవో రవీందర్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. రాజవేణు, చంద్రమౌళి, తులసిపతి, మల్లేశం పాల్గొన్నారు.

ఎన్‌సీసీలో విద్యార్థులకు అడ్మిషన్లు

మంచిర్యాలఅర్బన్: స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు శుక్రవారం 32 బెటాలియన్ ఎన్‌సీసీలో అడ్మిషన్లు కల్పించారు. కల్నల్ వికాశ్, ఆశోక ఆధ్వర్యంలో 50 మంది బాలికలకు కొత్తగా అడ్మిషన్లు ఇచ్చారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శారద, కేర్ టేకర్ గీత పాల్గొన్నారు.

పచ్చిరొట్ట సాగుపై అవగాహన

చెన్నూర్‌రూరల్: ఆస్నాదలో పచ్చిరొట్ట ఎరువుల సాగుపై ఏఈవో సాగర్ శుక్రవారం రైతులకు అవగాహన కల్పించారు. ఆయిల్‌పాం సాగు ప్రాముఖ్యత, వానాకాలం పంటల సాగులో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యల గురించి వివరించారు.

ఇంటింటా మొక్కలు పంపిణీ

రామకృష్ణాపూర్: క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 1వ వార్డులో హరితహారం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఇంటింటా మొక్కలు అందజేశారు. సుమారు 500 మొక్కలు పంపిణీ చేశారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ సాగర్‌రెడ్డి, వార్డు కౌన్సిలర్ పోగుల మల్లయ్య, బీఆర్ఎస్ పట్టణ ఇన్‌చార్జి గాండ్ల సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

తాండూర్: తాండూర్ పంచాయతీలో హరితహారంలో భాగంగా సర్పంచ్ పూదరి నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో గ్రామస్తులకు మొక్కలు అందజేశారు. ప్రతి ఇంటికి 6 మొక్కలు అందించారు. జెడ్పీటీసీ సాలిగామ బానయ్య, వార్డు సభ్యులు సుజాత, చరణ్, కార్యదర్శి తపాస్, ఎఫ్ఏ రాజేశ్వరి, గంగపుత్ర సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్నయ్య, సంతోష్, గ్రామస్తులు పాల్గొన్నారు.